

# మా వూరికి చారెడు నేల కావాలి

హనీఫ్

కథ

సన్నటి ముసురు. నేలంతా బాగానాని వుంది. అడుగు తీసి అడుగు వేస్తే చెప్పులు ఆసాంతం బురదలోనికి కూరుకుపోబట్నాయి. ఇంకా గట్లనే నాల్గంగలేస్తే చెప్పుగూడలు వూసిరావడం ఖాయమన్పించి చేతుల్లోకి తీస్కొని నడవబట్టిండు. తుఫాను ముసురు మూడ్రోజుల సంది కురుస్తనే వుంది. దారినిండా గొడ్లు, మేకలు, గొర్లు నడిచిన డెక్కల గోతుల్ల నీళ్ళు నిండి వున్నాయ్. తను అడుగుతీసి అడుగులేస్తుంటే బురద మోకాలెత్తులేసి పాంటును తడిపేస్తుంది. మరోతొవ్వ లేక గట్లనే నడుస్తుండు. ఊర్లోకి పోయేటందుకు మేన్‌రోడ్ల బస్సుదిగి నల్ల చెరువు కట్టమీదినుంచే కాలినడకనే రావాలె. ఎండాకాలమైతే బండ్లు, సైకిళ్లు కట్టమీదినించి నడుస్తయి. వర్షంలో మాత్రం కాలినడుకే, తప్పదు. కట్టమీది మైసమ్మ చింతచెట్టు, చెట్టుమొదట్లో మోకాలెత్తురాయి దానిమీద పసుపు, కుంకుమ చల్లిన బొట్లు అగుపిత్తన్నె. చింతకాయలు ఇర్గకాసేడ్డి, దారెంట వచ్చిపోయేటోళ్లు చూసి "చింతకాయలు కోయడానికి మైసమ్మ తల్లి నెత్తిమీద నుంచి చెట్టెక్కుతార్ర కండ్లుపోతాయి బిడ్డా, సత్తెనాస్ అయిపోతరు. కింద రాలినయి ఏర్కొతినండ్లి" అని చూసినోళ్ళు గద్దిచ్చుడు. ఎవరూ చూడనప్పుడు గబుక్కున చెట్టెక్కుడు గుర్తొచ్చి తన్లోతనె నవ్వుకున్నడు. అప్పుడే ఆకాశంలో మెరుపు మెరిసింది 'నేనున్నా'నని తెల్లగా మెర్సి పోతూ మైసమ్మబండ కండ్లపడ్డది.

చెరువు కొమ్ముమీద కొద్ది దూరంల మాదిగ్గూడెం, ఇటుపక్కల ఊరుగూడెంల ఎవరో శోకాలు తీస్తున్నరు ఆడగొంతు. పాపం పెనిమిటో, కడుపు పంటో పోయివుంటరు. యాదికొచ్చి ఏడుస్తుంది. అక్కడక్కడ తడికల సందుల్లనుంచి దీపంబుడ్ల వెల్తురు చిమ్ముతున్నాయి. ఊర్లో గొల్లలు, నాయికపోళ్లు, తురుకలు రెండు కమ్మోరిండ్లు, రెండు బాపనోళ్ళ కుటుంబాలుంటయి. మాలోళ్ళు వున్నరు వాళ్ళు కూడా ఊర్లనే కలిసేవుంటరు.

నేనెప్పుడూ ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ షహనాయి విన్లేదు. కాని మాలోళ్ళ ఇలంగి గురువయ్య సన్నాయి మాత్రం చిన్నప్పటి సంది వినని పసికందు ఊళ్ళో మిగలడు. తెల్లారగట్ల నాల్గున్నర ఐదుగంటలకి తన కొడుక్కి సన్నాయి నేర్పిస్తూ సాదన చేస్తుండేవాడు. సన్నాయిలో లయబద్దంగ ఎన్నో పాటలు పాడేవాడు, సన్నాయి వాయిద్యంతోటే ఊరు మేల్కొనేది. పాలేర్లు లేసి రైతులిండ్లకు పోయేటోళ్ళు. గొడ్లసావిడ్ల అలకిడి షురూ అయ్యేడ్ది, పేడ తీసుడు, ఊడ్సుడు. పాటుతీసుడు, అరకలు కట్టి ఎడ్లను ఇడ్సి బీళ్ళలో మేతకోసమని తోల్కపోయేటోళ్ళు. కొద్దిసేపటికి కాకులు, పక్షులు రెక్కలల్లార్చుకుంట చెట్లమీది నించిలేసి ఎటో మేతకోసమని వెళ్ళిపోయేటివి. ఎనకటి రోజులు యాదికొచ్చి ఆలోచన్లు సాగుతున్నయి గని దారి ముందుకు జరగడంలేదు. ఎక్కడ సరుక్కున జారి కట్టకింది మళ్ళలోనో, అటుపక్క చెరువులో దొల్లుకుంట పోతనో అని మనసులో అనుకుంట అడుగుల అడుగేసుకుంట నడవ బట్టిండు. ఇంతల వరిమళ్ళ మధ్యన గెట్టెంబడి నడిచొస్తున్న సేకుసిందు చేతిలో టార్చి లైటును మొకం మీద పడేటట్టు ఏసిండు.

ముఖం కండ్ల బడం గనే "అయ్యో చిన్నదొర తమరా, అర్ధం రాత్రి రాబట్టింగ్రు?" అని మందలించిండు.

"ఏరా సేకుసిందు ఎట్లున్నవు? బోరున వర్షం కురుస్తున్నా చెరువు కాపలాకాస్తున్నవా?" అని అడిగిండు.

"ఎవలకు తప్పినా నాకు తప్పిద్దా చిన్నదొర" అన్నడు సేకుసిందు.

"నమ్మకస్తుడివిగదా, ఊరోళ్ళందరూ నిన్నే వుండమంటరాయే" అన్నడు తను.

"ఏదో మీ దయకొద్ది రోజులు దొర్లిస్తున్న బాంచెన్" అన్నడు.

"ఏందిరో గూడెపోళ్ళు ఈ రోజు జాగారం చేస్తున్నార్ర, దీపాలు అన్నిండ్లంల్ల ఆరకుండా వెలుగుతున్నయ్" చీకట్లో అగుపడవని తెల్సి కూడా కండ్లెగరేసిండు.

"ఏదో గత్తరొచ్చింది, కలికాలం. పోగాల మొచ్చింది దొరా. కాలి కింది చెప్పులు కాళ్ళను అంటిబెట్టుకోనుండక భుజాలెక్కి ఊరేగుతామంటే ఎవరు వప్పుకుంటరు" అన్నడు సేకుసిందు.

"ఏందిరా, ఏంజరిగింది?" అని అడిగిండు.

"రేప్పొద్దుగాల మీరే ఇంటరుగా, నడిరాత్రి మీటింగ్ దేనికి" అని కట్ట చివరి దాకా టార్చిలైటు చూపెట్టి కట్ట దాటించిండు.

** ** **

ముసురు వెల్సింది, తుఫాను జాడలింకా ఆకాశంనిండా కన్పిస్తనే వున్నయి. పొద్దింకా కనపడ్తలేదు. గొడ్లు, మేకలు, గొర్లు అడివికెల్తున్నాయి. టైం పది కావస్తంది. తను ఊరికి వచ్చినప్పుడల్లా లేచే వేళ ఇదే. నోట్లో బ్రష్ వేసుకొని ఇంటెనుకకు పోయిండు. వదిన పనిమనిషి తోటి ఏదో మాట్లాడుతుంది. దొడ్లోకి పోయి ముఖం కడుక్కొని స్నానం గట్రా ముగించుకొని వచ్చిండు.

'అప్పుడే స్నానం జేసినవేంది?' తనవేపు ఆశ్చర్యంగ చూస్తూ వదిన, మళ్లీ తనే 'మీ అన్నప్పటికి రెండు, మూడుమార్లు అడిగిండు 'లేసిండా, లేసిండా అని' ఆగింది.

'ఎటన్నా పోతుండా?'

'ఈరోజు యాడికిపోడు, ఊర్లో పంచాయితి వచ్చిపడింది గదా' అంది.

'ఊళ్ళో ఏదన్న జంట లేసిపోయింన్లా ఏంది?' నవ్వుకుంటూ అన్నడు.

'ఎప్పుడూ గయ్యే వుంటయా ఏంది? జరంత కోపంగనే ముఖం పెట్టి మళ్ళీ తనే అంది. 'ఊరంటే నీకు బొత్తిగా లెక్కలేకుండా పోయింది. చదువుకున్నోనివి గట్లనేనా మాట్లాడేది' అంది.

'సారీ, సారీ వదిన, నీ సీరియస్‌నెస్ నేను పసికట్టలే తప్పైంది క్షమించవా' అని ప్రాధేయపడిండు.

'ఇంజనీరింగ్ చదువుకున్నోనివి, ప్రపంచంపోకడ గురించి నీకు చెప్పగలదాన్నా ఏంటి. గ్లోబలైజేషన్‌తో ప్రపంచమంతా చిన్న గ్రామంలా మారిపో

**ఊరన్నంక కొన్ని కట్టుబాట్లుంటయ్. మంచీ, చెబ్బర్లుంటయయ్. నాల్గు అక్షరం ముక్కలు సదువుకొని నాకూ హక్కుందని ఎగేసుకొని వస్తే అంత తేలిగ్గ రానిత్తరాఏంది? పూర్వీకులు ఏకులపోల్లు ఎక్కడ వుండాలో హద్దులు పెట్టింన్రు. వాల్లంతా ఎర్రోల్లా, సదూకోనోళ్లా. వాళ్ళు వేదాలు సదువుకున్నోళ్ళు కాబట్టే ఊరు కట్టుబాట్లను పెట్టింన్రు. ఆ రివాజున గట్లా నడ్సుకోండ్రి అన్నరు.**

తుందని కలలు కనే వాళ్ళుగా మీరంతా' అని అంది వదిన.

'వదినా తిడుతున్నావా, పొగుడుతున్నావా? ఇంతకి నా ఇంజనీరింగ్ చదువుకి, గ్లోబలైజేషన్‌కు ఈరోజు మన ఊర్లోని పంచాయితీకి లింకు ఏంటి? కాస్త వివరించవా' అని ప్రాధేయపడిండు ఏమీ అర్థం కానట్టు ముఖం పెట్టి.

'ముందు టిఫిన్ తిను ఆ తరువాత చెప్తాను' అంది

'తింటూ వింటాను చెప్పు' అన్నాడు.

"మన రాష్ట్రప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు, హరిజన, గిరిజను లకు పక్కాగృహాల పథకం ఒకటిపెట్టి, ఇళ్ళు కట్టుకోవడానికి కొంత డబ్బు సబ్సిడీకింద మాఫీ చేస్తుంది గదా, ఆ పథకంలో ఇల్లు మంజూరైన ఒక దళితుడు నడి ఊర్లో వున్న తన స్వంత జాగాలో ఇల్లు కట్టుకుంటానికి పునాదులు తవ్వటం మొదలుపెట్టిండు. అగ్గో ఆడనే ఊరు పునాదు లన్నీ కదిలిపోయినయి. అందరు గగ్గోలు మొదలు పెట్టిండ్రు. 'మాదిగోడేంది, నడిఊర్లో ఇల్లు కట్టుకోవడమేందని, ఇది ఊరావల్లకాడా' అని ఆగక పునా దులు తవ్వడానికివేసిన ముగ్గు తుడ్చేసి ఇల్లుకట్టుకోవడానికీల్లేదని హుకుం జారీ చేసింన్లు ఊర్లోని పెద్దమనుషులు కొందరు" అని కొద్దిసేపు ఆగింది.

'వాల్లేమంటున్నరు?' ఆసక్తిగా అడిగిండు.

'వాల్లేమన్నా తక్కువ తిన్నరా, మా జాగల మేం ఇల్లేసుకుంటే మీకేంది' అని తిరగబడింన్రు. కులం పేర తిట్టింన్రని తిట్టినోళ్ల మీద ఎట్రాసిటి కేసు పెడతమని ఠానాకు పోబోతుంటే, అట్లాగాదు నేన్నాయం చేస్తానని చెప్పి మీ అన్న వాళ్ళని ఆగబట్టిండు. 'అదిగ్గదే ఇప్పుడీ పంచాయితీ' అని తేల గొట్టి వంటగదిలోకి వెళ్ళింది వదిన.

తుఫాను మబ్బు వీడిపోయినట్టు, సస్పెన్స్ నుంచి కొద్దిగా తేరుకున్నా డు. నిజంగనే ఈ సమస్యమీద ఎవరూ ఏమీ మాట్లాడకపోవడం ఏంటి? అనే ప్రశ్న మొలకెత్తింది. గాంధీ, గాంధేయవాదులంతా హరిజనోద్ధరణ, గుళ్ళో ప్రవేశాల గురించే మాట్లాడింన్రు కాని, ఊళ్ళోకి ప్రవేశించడంపై చాలా మట్టుకు మౌనమే వహించింన్రు. గ్రామానికి, గూడేనికి మధ్యన వున్న అంటరాని సరిహద్దుని చెర్పేందుకు, దాన్ని గురించి మాట్లాడేందుకు ఇప్పటి వరకు ఎవరూ ముందుకు రాలేదు. మహాఅయితే కమ్యూనిస్టు పార్టీల వాళ్ళు సహపంక్తి భోజనాల పేరుతో గూడెంలోకి పోయి, ఆ కాసింతసేపు వాళ్ళతోవుండి పండగ తంతులాగ కొద్దిసేపు వాళ్ళతో గడిపి, ఉపన్యాసాలు దంచి వచ్చింన్రే కాని గూడెపోళ్ళని ఊర్లోకి పిల్చి సహపంక్తి అని తమ పెళ్ళాంపిల్లల్ని తోడుగా కూర్చోబెట్టలేకపోయారు.

ప్రభుత్వాలు పక్కాగృహాలు కట్టిస్తూ కాలనీల పేర పాతగూడెం వున్న చోట్లోనే కొత్త 'గూడెం' కట్టిస్తున్నరేగని, అంతరాలు చెర్పేసే విధంగ కాకుం డా ప్యూడల్ భావాలకు అలవాలంగ నిల్చే ప్రమాణాలనే కొలబద్దలుగా పాటిస్తూ వస్తున్నారు. మార్పును తీసుకురాలేకపోతున్నారు. భూస్వామ్య పెత్తందారీతనం బాగా వేళ్లానుకున్న గ్రామీణ వ్యవస్థ అంతతేలిగ్గా మారుద్దా. అందుకు ఎవరో ఒకరు ప్రయత్నం చేయాలిగ ఆ ప్రయత్నం మొదలైందనిపించింది.


"ఏంటయ్యి తెగ ఆలోచిస్తున్నవ్?" వంటగదిలోంచి వస్తూ తన వాలకం చూసి పలకరించడంతో తేరుకొని, చేయికడుక్కొని డైనింగ్ టేబుల్ దగ్గరి నుంచి లేచాడు. వదిన, పిల్లలతోటి మాట్లాడుకుంటనే ప్రతి ఐదు, పది నిమిషాలకోపాలి గేటువేపు చూసుండు అన్న వస్తడేమోనని. వచ్చీరాంగనే పంచాయితీ పరిష్కారం గురించి అడగాలని ఆరాటవడుతుండు. అన్న ఎంతకీ ఇంటికి రాకపోవడంతో తనే పంచాయితీ దగ్గరకెళ్ళిండు.


ఊర్లోని పంచాయితీలన్నీ ఈ చింతచెట్టు కిందనే జరుగుతుంటయి. ఎన్నో న్యాయ, అన్యాయాలకు సాక్షిగా నిలబడి ఉన్నట్టుగా అగుపిస్తుందీ చెట్టు. వందమందికి పైగానే చెట్టునీడన కూర్చోని వున్నారు జనం. చెట్టు చుట్టూర అరుగు కట్టించి వుంది. ఆ అరుగు మీద ఐదారుగురు పెద్ద మనుషులు కూకోనున్నరు. ఇంతకు ముదాలు తన చిన్నప్పటి సంది ఈ చెట్టుకింద జరిగిన ఎన్నోపంచాయితీలు చూసిండు. అరుగు మీద ఒక్క మున్సబే వుండేటోడు. కానీ ఇప్పుడు అరుగుమీద మున్సబుతో సమానంగ అందరూ కూకున్నరు. మున్సబులో ఇంతకు ముందున్న దర్పం కన్పించ దంలేదు. పులిలా కూర్చునేటోడు, మేక చర్మం కప్పుడేమే అనుకున్నా ఆ దాఖలాలు ముఖంలో కన్పించడంలేదు. మునుర్లో మేకల మందలో మునగదీసు కొని కూర్చున్న మేకపోతులాగ కూర్చున్నడు. దానిక్కారణం లేకపోలేదు ఊర్లో నానా పార్టీలు వచ్చి చేర్నై, కాస్త డబ్బునోడల్లా తలా ఒక పార్టీలో చేరి లీడరు అనిపించుకుంటుండు. అనిపించుకుంటున్నరేగని తన మాట మీది పోవడంలేదు. పని వున్నా లేకున్నా అందరూ తనకాడికే వచ్చి కూర్చుంటరు. ఆ ఒక్క సంతృప్తివల్లే అప్పుడప్పుడు మీసాలు మెలేసుకుంటాడు మున్సబు. జనం రెండు గుంపులుగా విడిపోయి కూకో నున్నరు. గంతమందిల లచ్చిగాడొక్కడే చేతులు కట్టుకొని నిలవడ్డడు. తప్పుచేసినోళ్లకిమల్లె. దిక్కులు సూత్తండు, మాటలాలకిత్తండు. పెద్ద అండ వున్నట్టే ధైర్నింగున్నడు. తెల్లచొక్కా, పంచా కట్టి బుజాన కండువా వేసుకున్నాయన నిలబడి మాట్లాడుతుండు. ఎంతసేపట్నించి మాట్లాడు తుండో పెదాలు తడారిపోంగ మధ్యమధ్యల నాలుకతో పెదాల్ని తడి చేస్కుంటుండు.

'....ఇట్లా ఎవల్లుపడితే వాళ్లు ఇష్టం వచ్చినట్టు ఊరేగుతమంటే సరి పోద్దా ఊరా, వల్లకాదనుకున్నరా? ఊరన్నంక కొన్ని కట్టుబాట్లుంటయ్. మంచీ, చెబ్బర్లుంటయయ్. నాల్గు అక్షరం ముక్కలు సదువుకొని నాకూ హక్కుందని ఎగేసుకొని వస్తే అంత తేలిగ్గ రానిత్తరాఏంది? పూర్వీకులు ఏకులపోల్లు ఎక్కడ వుండాలో హద్దులు పెట్టింన్రు. వాల్లంతా ఎర్రోల్లా, సదూకోనోళ్లా. వాళ్ళు వేదాలు సదువుకున్నోళ్ళు కాబట్టే ఊరు కట్టుబా ట్లను పెట్టింన్రు. ఆ రివాజున గట్లా నడ్సుకోండ్రి అన్నరు. ఇప్పుడు వాట్ని కాళ్ళతంతం అంటే ఎవళ్ళు వప్పుకుంటరు. మాటిమాటికి కాలం మారింది కాలంమారిందంటున్నరు. ఇప్పుడేమన్న మనిషి అన్నం తినడం మాని ఇంకేమన్నా తిని బతుకుతుండా ఏంది? ఎక్కడుండాల్సినోళ్ళు అక్కడ వుంటేనే ఊరని అంటరు. లేకుంటే మరేదో అనాల్సివస్తది' అని ఆగి ఊపిరి ఎగపీల్చి కూర్చున్నడు.

జనంలో గుసగుసలు మొదలైనయి. 'భలేగ చెప్పిండ్రా నా కొడుకులకి దీంతో తిక్కదిగుద్ది' అని చెవులు గొరుకుంటున్నరు. ఒక పక్కకూకున్న జనం గుంపు, మరో పక్క గూడా చెవులు కొరుక్కుంటనే వున్నరు . చిన్న చిన్నగా పోయి పెద్దగనే చెప్పుకుంటున్నరు. ఇరుగుంపుల మధ్య ఏదో రాజుకుంటుందని కనిపెట్టిన ఓ పెద్దమనిషి గట్టిగనే గద్దిస్తూ 'ఆవుండ్రి లొల్లి, గుసగుసలు, కబుర్లు చెప్పుకోవడానికి వచ్చింన్రా. ఏమన్నా మాట్లా దేదేమన్నా వుంటె లేసి నిలబడి అందరికి ఇనబడేటట్లుగ మాట్లాడండి లేదంటే గుసగుసలు కట్టిపెట్టిండ్రు' అని అన్నడు. గ్రూపు మీటింగులు, గుసగుసలు టక్కున సద్దుమణిగినయి. ఎవళ్ళు లేసి మాట్లాడతరా అని అన్ని దిక్కులు చూస్తున్నాయ్ జనంచూపులు. కొద్దిసేపటికి రెండో గుంపు లోంచి నడివయసుకారు మనిషి లేసి గొంతు సవరదీసుకోవడానికన్నట్టు 'హుం' అన్నడు. గడియ గడిచినంక

"అయ్యా గ్రామపెద్దలు, ప్రభువులు అందరికి పేరు, పేరున దండాలు. జర కాస్త దయతో మామొర ఆలకించండ్రి. మా గూడెపోళ్ళు సదువు కోలేదు, మా తాతముత్తాతల కాడినుంచి మీ కాళ్ళకాడే చెప్పులు కుట్టో, కూలి-నాలి జేస్కొని మీ ఇండ్లల్లో జీతగాళ్ళుగా వుండి బతుకులు ఎల్ల బుచ్చింన్రు. స్వతంత్రం వచ్చినంక అరవైఏండ్లకు మా పోరగాళ్ళ నాలుకల






మీదికి నాల్గు నల్లచ్చురం ముక్కలు చీమలబార్లతీర్గ ఎగబాకడం మొదలు పెట్టినయి. మాగూడెం పోరగాళ్ళు సుచి శుబ్రం గుండటం నేర్సుకుంటు న్నరు. తలకు నూనెరాసుకొని క్రాపులు దువ్వుకుంటున్నరు.

మా తాత ముత్తాతల్లాగ సచ్చిన కళేబరాల్ని కోసుకొని తినడం లేదు. మా ఇండ్ల కంచెల మీద గొడ్డు మాసం తునకలు ఎండబెట్టుకోవడం లేదు. గరీబోళ్ళం మీలాగ కరీదుగల తిండి తినకపోయినా ఒక మాదిరి అన్నం తింటున్న వాళ్ళమే. వంటి మీదికి వున్నకాడ్నిలో శుబ్రమైన బట్టలే తొడుక్కుంటున్నం. మా లోగిళ్ళు మరీ నీసుబారిపోవడంలేదు. కళ్ళాపి చల్లి, ముగ్గులుపెట్టుకొని నిగ,నిగలాడక పోయినా నుదుటి మీద బొట్టున్న ఆడకూతురులాగ కాస్త నదురాగానే వుంటున్నాయ్. మేం పొరాయి ఊరు పోతే, మేం అంటరానోళ్ళమని గుర్తుపట్టే ఆనవాళ్ళు మాదగ్గరిప్పుడు లేవు. మరి మేం ఏం పాపం జేసినమని మమ్మల్ని ఇంకా దూరంగా వుంచాలని చూస్తున్నరు. మీరూ ఈ భూమ్మీదనే ఇళ్ళు, భవంతులు కట్టు కున్నరు, మేమూ ఈ భూమ్మీదనే ఇల్లో, పూరిగుడిసో కట్టుకున్నం గదా. మీది ఊరెట్లా అయింది. మాది అంటరాని గూడెం ఎట్లా అయిందో కాస్త చెప్పుండ్రి" అని కొద్దిసేపాగిండు. మల్లా తనే-

"మీరందరూ కాస్త దేశాల మీద తిరిగొచ్చినోళ్ళే గదా, ఏదన్ని పట్నం లా, టౌనుల ఇక్కడున్నట్టు వేరుబందం కనిపిస్తదా? సమస్త పెజలు కలివిడిగనే వుంటున్నరు. పట్నంలా, టౌనులల్ల గూడెం యాడనన్నా కన్పి స్తదా కంటికి. కాకుంటే పేదోళ్ళ స్లమ్ ఏరియాలుంటయ్. అన్నికులాల పేదలు ఆ మురికి బస్తీల్లో వుంటున్నరు. తేరిపారంగ చూసిరండ్రి. మరి గక్కడ లేంది ఈ పల్లెటూళ్ళె అంటరాని గూడేలు ఎందుకంట? అంతటా మారిపోయినపుడు ఊల్లె ఎందుకు మారకూడదు ఆలోచించిండ్రి. ఎవల న్నరు,ఊర్లో మార్పురాలేదని, పచ్చి అబద్దం. మన తాతముత్తాతలు ఎద్దు ముడ్డిపొద్దు కుంట కొయ్యనాగళ్ళతో దున్నేటోళ్ళు.ఎంత దూరమైనా కాలి నడకన కోసుల కొద్ది నడ్సుడేనాయే. ఆ ఎడ్ల అరకలు అగుపిత్తన్నయా, ఆ నడ్సుడు యాడపోయే.బస్సులొచ్చినయి, టాక్టర్లు అచ్చినయి, పంట కోసుడు యంత్రాలొచ్చినయి.ఎవల్లయ్య ఊల్లె మార్పురాలేదన్నది"అన్నడు.

"లచ్చిగాడు మీ ఆస్తులిమ్మన్నడా, భూములు పంచమన్నడా. ఊల్లె కాస్త స్వంతం జాగున్నది.నా చోటులో నేను ఇల్లేసుకుంటానన్నడు. ఊర్లో పడి దోపిడీకి వచ్చినట్టు తిట్టి, కొట్టి తరిమేయబడితిడి. ఇదెక్కడి నాయం, అయ్యలూ మీరేకాదు మేమూ ముప్పూటలు కాకున్నా ఒక్కపూటైనా అన్నమే తిని బతుకుతున్నాం. కాకుంటే మాది గొడ్డుకారం మెతుకులు అంతేతేడ" అని కూలబడ్డడు.

"ఏందిరో, యమతెలివిగ మాట్లాడుతున్నరు. కూకోబెట్టి మాట్లాడితే గిట్లనే నకరాల్ చేస్తరు. దుడ్డుకర్రలు తీస్కొని వెంటపడితే గూడెంలో పడే దన్క పారుకొని వురకాల లం...కొడుకులు."అన్నడు గుంపులోంచి ఒకడు.

"గాజులు తొడుక్కొని ఎవల్లేరిక్కడ, రాండ్రి చూసుకుందాం."అని కాలు దువ్వింది ఇవతలి గుంపులోంచి ఒకడు.

"అరెరే, కాస్త ఆగండ్రా, కొట్టుకొని సత్తానికారా ఇక్కడి కూకోబెట్టింది" అని గద్దించిండు ఒక పెద్దమనిషి.

గొడవ కాస్త సద్దుమణిగింది, నిప్పుల మీద బాగా నివురు కప్పు కుంది. తుఫాను ముందు నిశ్శబ్దంలానే వుంది, పెద్దమనుషులు నల్గురూ నాల్గుతీర్ల ఆలోచనల పడ్డరు. ముందుగా అనుకున్న ప్లాను తీర్గనే పాచి కలు కదపడానికి నల్గురూ ఒకనొక్కళ్ళు చూసుకొని సైగల్ చేసుకున్నరు. ముందుగాల అనుకున్న ప్రకారమే లచ్చిగాడ్ని తిట్టిన వాళ్ళని పంచాయితీ కాడికి రాకుండా చేసిండ్రు. జనమంతా పెద్దమనుషులు ఏం చెపుతరా అని చూడబట్టిండ్రు.ఒక లచ్చిగాడు మాత్రమే తప్పుచేసినోడికి మల్లె నిల్సో నున్నడు. ఊరు పెద్ద మున్సబు గుబురు మీసాలు సవరించుకుంటూ "ఏమయ్యాలచ్చయ్య" అని పిల్సిండు.ఇంతకు ముందైతే 'ఏందిరా లచ్చి గా' అని పిలిచేటోడు,పరిస్థితులు గమనించే గౌరవించి పిల్సిండు. మున్స బు ఇంకెవర్నో పిలుస్తుండేమోనని జనం కెల్లి చూస్తుండు లచ్చిగాడు.

"నిన్నే పిల్సేది, అటూ ఇటూ దిక్కులు చూడబట్నావు" అన్నడు మున్సబు. "అయ్యా దొర" అని చేతులు జోడించి దండం పెట్టిండు.

"నిన్ను అడ్డగించి తిట్టినోళ్ళు ఎవరో చూపెట్టు" అని జనం వైపు చూపి స్తూ అన్నడు.

లచ్చిగాడికి ఏమీ పాలుపోలే, ఏం జరగబోతుందో పసికట్టలేక సత మతమౌతూనే జనం వైపు చూసి వాళ్ళెవరూ కన్పించకపోవడంతో పెద్ద మనుషుల వైపు తిరిగి

"వాళ్ళెవరూ లేరు" అన్నడు అయోమయంగ ముఖం పెట్టి. జనంలో ఎవరో రహస్యం తెల్సినట్టు కిసుక్కున నవ్విండు.

"ఏరా సేకుసిందో..." పక్కనే నిలబడి వున్నా చూడనట్టే గట్టిగ అర్సిం డు మున్సబు.

"అయ్యా దొర" అని పలికిండు సేకుసింది.

"మీమీద పంచాయితీ వచ్చింది, ఊరు పెద్దమనుషులు రమ్మన్నరని చెప్పలేదురా? ఎందుకు రాలేదు బద్మాష్లు" అని అర్సిండు మున్సబు.

"అందరికి చెప్పిన, తప్పనిసరిగా రావాలని మీరు చెప్పమన్న వాళ్ళం దరింట్లకు పోయి చెప్పొచ్చిన దొర" అన్నడు.

"వాళ్ళే లేకుంటే పంచాయితీ ఏమైతది" తన్లోతనే అనుకున్నట్టు పైకన్న డు మున్సబు.

"మీరేంజేత్తరు, వచ్చే ఆదివారం నాటికి పంచాయితీ వాయిదా వేయిం డ్రి" అన్నడు మరో పెద్దమనిషి. ఆ మాటలతోటి క్షణం ఆలస్యం చేయ కుండా మున్సబు

"లచ్చయ్య ముద్దాయిలు లేంది పంచాయితీ ఏం జేస్తం, మళ్ళీ ఆది వారం నాటికి వాళ్లందరిని గుంజుకొచ్చి చెట్టుకు కట్టిపడేసి పంచాయితీ జరిపిస్తా, నువ్వు ధైర్యంగుండు" అని లేసి నిలబడ్డడు. జనం ఎవళ్ళకు వాళ్ళు, వాళ్ళకు తోచినవిధంగ అంచనాలువేసుకుంట ఇండ్లదారి పట్టిండ్రు.

"లంమిడి కొడుకులు, అందరూ కట్టకట్టుకొని గూడెమంతా తోల్కొని వచ్చిండ్రు. గదేదో ఊర్లో మాదిగోళ్ళు పెట్టుకున్న దేవుడి ఊరేగింపునే వూర్లోనికి రానీయలే, ఏకంగా ఊర్లోనే ఇల్లు కట్టుకోనిత్తమా? చూస్తుం డుండ్రి ఏం జరగబోద్దో తమాషా. ఇప్పుడూరుకుంటే రేపేమైనా అంటరు. చూస్తూ వూరుకునేది లేదు. దేనికైనా సిద్దంగుండాల" అని హెచ్చరించి ఇంటికెళ్ళిపోయిండు మున్సబు.

** ** **

రెండుమూడు దినాలు గడ్సినయి, ఎక్కడ బడితే అక్కడ అదే చర్చ, ఏనోటిన్నా అదేమాట. చేన్లకాడ, చెలకలకాడ, గొర్ల, మేకల కాపర్లు ఒక్క రేంది ఊరుజనమే కాదు చుట్టుపక్కల ఊళ్ళోలందరూ ఆసక్తిగా ఇటే చూస్తున్నరు. ఏమైతదో, ఏంజేత్తరా అని ఎదురు చూడబట్టిండ్రు. తోచిన కాడికి పక్కూర్లనుంచి సలహాలు, సంప్రదింపులు జరుగుతున్నయ్. సల్లి దవకండని ఎవరి పక్షాలకువాళ్ళు సలహాలిస్తున్నరు.కొందరైతే మల్లా జరిగే పంచాయితీ నాటికి మేమూ వస్తామని ధైర్నం చెడిద్దని హామీలు అందు తూనే వున్నయి. ఊరంతా సెగపెట్టిన కుమ్మరివామిలా పొగలు చిమ్ముతుంది.

ఊర్లో పొద్దుగాల్నే పాడిగేదెలకు, పాడి ఆవులకు పచ్చగడ్డి తెచ్చేందుకు

ఏదన్ని పట్నంలా, టౌనుల ఇక్కడున్నట్టు వేరుబందం కనిపిస్తదా? సమస్త పెజలు కలివిడిగనే వుంటున్నరు. పట్నంలా, టౌనులల్ల గూడెం యాడనన్నా కన్పి స్తదా కంటికి. కాకుంటే పేదోళ్ళ స్లమ్ ఏరియాలుంటయ్. అన్నికులాల పేదలు ఆ మురికి బస్తీల్లో వుంటున్నరు. తేరిపారంగ చూసిరండ్రి. మరి గక్కడ లేంది ఈ పల్లెటూళ్ళె అంటరాని గూడేలు ఎందుకంట? అంతటా మారిపోయినపుడు ఊల్లె ఎందుకు మారకూడదు?

చేన్లకు పోయేవాళ్ళు సద్దిబువ్వ రవ్వంతతిని కొడవళ్ళు చేతపట్టుకుని చేన్లకు పోతున్నరు.వెంకటేశం కూడా పచ్చగడ్డికోసం బైలెల్లడం చూసింది తల్లి మంగమ్మ.

"ఒరి వెంకటేశం జర కాస్త జాగర్తగుండు బిడ్డా, ఏమన్నా మిడిమాలపు పనిజేస్తివా ఇగచూడు ఊరు బుగ్గై పోతది. అట్టాంటి జోలికి పోమాకు." అని హెచ్చరించింది తల్లి .

"ఏహె...ఊరుకోవె...ఊరందరిది ఒకదారైతే వులిపిరి కట్టెదొదారి అన్నట్టుంది నీతంతు" అని తల్లిని కసిరించుకొని కొడలిలిక్కి సైకిల్ హ్యాండిల్ కు తగిలించుకొని తల్లి మాటలు ఇనకుండనే సైకిలెక్కి చేన్లదారిపట్టిండు.

ఏం జేస్తరు తల్లి భయం తల్లిది. మిడసరపు పొల్లకారు. ఎటు నుంచి ఏంముంచుకొచ్చుద్దో, ముంచుకొచ్చి మీద పడేవరకు సోయి వుండదు. ఇంకా యాడాది కాలె, మాదిగోల్ల 'ఎంకి' ఈడికి వున్న సవాసం బైటపడి. కంది చేలో ఎంకిని, వెంకటేశాన్ని పట్టుకొని ఎంకి మొగుడు కూత్తెగోల జేసిండా. అప్పుడు ఊర్లో ఏం గొడవలు లేవు కాబట్టి సరిపోయింది. ఏదో ఊరు పెద్దలు సర్దిచెప్పి గొడవ చేయిదాటి పోకుండా కాపాండింఁడ్రు. "ఇప్పుడైతేనా.. " అని తల్లి గుండెలు బాదుకుంటుంది.

కాలిబాటన సైకిల్ తొక్కుతున్నడనే గాని వెంకటేశం మదినిండా ఎంకి నిండివుంది. ఒక్క కులం తక్కువదనే గాని ఎంక్కసుంటి పొల్ల చుట్టు పక్కలనాల్గూర్లు కలెసి చూసినా యాడాదొరకది.దాని రూపురేఖలు గుర్తు కొస్తే పిచ్చెక్కిపోతడు. చేంన్ల మంచెల మీద ఎంకీ, తను ఎన్ని వెన్నెల రాత్రులు గడపలేదు. ఎన్ని కబుర్లు చెప్పుకోలేదు. ఎన్నెన్ని కలల గూళ్ళు కట్టుకోలేదు. రెండుమూడుసార్లు ఇద్దరు కలిసి ఎటన్నా లేచిపోయి హాయిగా ఏ కొండ, కోనల్లోనో ఈ అంతరాలకు అడ్డుగోడలకు దూరంగ బతకాలనుకున్నరు. కాని సాహసం చేయలేకపోయారు. ఇంతల ఎంకికి పెండ్లి చేశారు. అప్పటి నుండి గుట్టుసప్పుడు కాకుండా కంది చేలల్లో, జొన్న చేలల్లో కలుసుకుంటుండేవారు. ఎంకి నెలరోజుల సంది కనిపిస్తనే లేదు. అని ఆలోచిస్తూ సైకిల్ తొక్కుతుండు.ఇంతలో ఎంకోళ్ళ అయ్య కందిచేలో గడ్డికోసేది ఆపి ఎంకిలేసి నిలబడి తనవైపే చూస్తూ అగుపడ్డది. టక్కున సైకిల్‌కి బ్రేకులుపడ్డాయి. సైకిల్‌దిగి చేలోనికి ఎంకిదగ్గరికి పోయిండు.

"ఏంది. ఈ మధ్యలో బొత్తిగ కన్పిస్తలేవు" అని పలకరించిండు వెంకటేశం 'మే మేడ కన్పిత్తం మీ కండ్లకు, మేం అంటరానోళ్ళమాయే" అని దెప్పిపొడ్సింది ఎంకి. "ఊర్లో గొడవలు మనకెందుకే" అని మీద చేయి వేసిండు వెంకటేశం. మాటలే గని చేతల్లో కసిరిచ్చలేదు ఎంకి. ఇంక కాస్త చొరవ ఎక్కువ చేసిండు, ఎంకి కాదనలేకపోయింది. కాని మనసులో యాడనో మండుతున్న నిప్పుసెగ తల్గుతనే వుంది. ఎట్లా బైట పెట్టాలా అని ఎదురు చూస్తుంది ఎంకి. కాసేపైనంక "మొన్న పంచాయతీలో దుడ్డు కర్ర తీస్కొని మాలావు నిల్సున్నవంట" అంది ఎంకి "గయి అన్నీ ఇప్పుడెందుకే..."అంటుండగనే పైకి లేవబోతు కాలితో కావాలనే తన్నింది ఎంకి. వెంకటేశం వెల్లకిలాపడి, దులుపుకొని లేవబోతుండగ-

"ఇక్కడైతే అడ్డురావుకాని, ఊర్లో అడ్డమొత్తయా మా అంటరాని బతుకులు" అంది కసిగ ఎంకి.

తెగ ఫీలయిండు, బైటికి కనపడనీయలే తల దించుకున్నాడు దించుకున్నట్టే తలపై కెత్తకుండ అవమాన భారంతో సైకిల్ దిక్కు నడిసిండు వెంకటేశం.

ఎంకి ముందు తనలో తను నవ్వుకుంది. వెంకటేశం వెళ్ళినంక బిగ్గరగా నవ్వింది చేలోని కందిపూలు పూసినట్లు. అవమానభారంతో తల దించుకొని వెంకటేశం పోయిన దిక్కు చాలాసేపు చూస్తూ నిల్చుండి పోయింది ఎంకి.

** ** **

ఊర్లో మీటింగ్ అనుకున్న రెండ్రోజులు ముందుగనే సాయంత్రం సాటింపు చప్పుడు విని ఊరుజనం అయోమయంలో పడ్డారు. ఊరు సాటింపు చేసే పేరిగాడు బిగ్గరగా అరుస్తూ చెప్పుకోపోతుండు. "మన ఊరు సమస్త ప్రజలందరికీ తెలియచెప్పేదేందనగా, రేపు మన ఊరుకి ఆర్.డి.ఓ. గారు వచ్చి ప్రజలందరి తోటి మీటింగ్ పెడతరంట కాబట్టి ఊరు ప్రజలందరూ హాజరుకావాలని కోరుతున్నారహో...!" అని చెప్పుకుంట పోతుండు. హటాత్తుగ ఆర్.డి.ఓ. ఊళ్ళకు ఎందుకత్తండో, ఎమో ఎవల్లకు అంతు చిక్కడం లేదు. ఈ మాదిగ ముండాకొడుకులేమన్నా? కంప్లైంట్ ఇచ్చింరా ఎంది? రకరకాలుగా జనం చెప్పుకుంటున్నరు. ఒకరిద్దరు మున్సబు గారికేమన్న తెల్సునేమోనని ఆరాతీయంగ వచ్చి అడిగింరు. మున్సబు సుత పెదవిర్సిండు తెల్వదన్నట్టు. ఆ రాత్రంతా గుడగుడల్లోటే గడిచి తెల్లారింది.

పొద్దుగాల్నె సేకుసిందు మున్సబు ఇంటి ముంగట వచ్చి నిలబడ్డడు. ఏమన్నాపనికి పురుమాయిస్తడోనని. మున్సబు పొద్దుగాల్నే లేసినట్టుంది, ఇంటెనుకాల దొడ్లో ఖాండ్రించి వుమ్మిన సప్పుడు ఇనపడుతుంది. ముఖం గట్రా కడుగుతున్నటుంది అనుకున్నడు.సేకుసిందు వచ్చింది చూసిన పని మనిషి పోయి మున్సబుతో చెప్పింది. "వాణ్ణి ఇంటెనకాలకు రమ్మను"అని చెప్పిండు. సేకుసిందు పక్కసందులోంచి దొడ్లోకి పోయి "దణ్ణం దొర" అని తలపాగ తీసి దండం పెట్టిండు. 'ఏం జేస్తున్నవు?' అన్నట్టు కండ్లెగరేసిండు మున్సబు. "రాత్రి విలేజ్ అసిస్టెంట్ కబురు పంపిండు పొద్దుగాల్నే బడికొట్టం శుభ్రం చేసిపెట్టమని, ఇద్దరు పనోళ్ళను వూడిపిత్తానికి పెట్టి మీ దెగ్గరికొచ్చిన" అన్నడు సేకుసిందు.

"ఆర్.డి.ఓ.సారు వచ్చినంక నాకు కబురుపెట్టు. ఎవళ్ళన్నా అడిగితే ఇంట్లనేవున్నా వస్తున్నానని చెప్పు" అన్నడు మున్సబు. సరేనన్నట్టు తలూపి అక్కడ్నుంచి బైటికొచ్చిండు సేకుసిందు.

పదిగంటలు కాకమునుపే ఆర్.డి.ఓ. గారి జీపు, మరో రెండు జీపులతోటి ఊర్లోని బడి కొట్టం దెగ్గరకు వచ్చినయ్. అప్పటికే మండలంలోని చిన్నా చితక ఆఫీసర్లందరూ వచ్చేసింర్రు. జనం కూడా వచ్చినటే లెక్క. ఎవరొచ్చింర్రు, ఇంకెవరు రావాలె అని ఏమీచూడలే ఆర్.డి.ఓ. జీపు దిగంగనే జనం మధ్యలోంచి దారిచేసుకుంట టేబులు, కుర్చీలు ఏసిన జాగలపోయి ఒక కుర్చీలాక్కొని కూర్సుండు.

(తరువాయి 29వ పేజీలో)



# మా ఊరికి చారెడు నేల కావాలి

(21వ పేజీ తరువాయి)

ఎమ్మార్వో మైకులో ఏదో చెప్పపోతుండు, ఆర్.డి.ఓ. లేసి మైకు దెగ్గరకి వచ్చి నిలబడంగనే ఎమ్మార్వో పక్కకు జరిగిండు. కొద్దిసేపు గట్లనే నిలబడి జనం వైపు చుట్టూ కలియచూసిండు.

"మనప్రాంతం వాళ్ళందరికి మంచి రోజులొచ్చినయ్" అని కొద్దిసేపాగిందు అర్.డి.ఓ. జనమంతా ఏం చెప్పబోతుండోనని ఆసక్తిగా నోళ్ళు తెర్చి కన్నార్పకుండా ఆర్.డి.ఓ. వైపే చూస్తున్నరు.

"ఎన్నో ఎండ్లనుంచి మన ప్రాంతంలో మంచిరోడ్డు లేక తెగ ఇబ్బంది పడుతున్న సంగతి వేరేచెప్పనక్కరలేదు. బస్సులో ప్రయాణం చేస్తే, నిండు చూలాలు దవాఖనకు పోద్దో, దార్లోనే కంటదో మనకు తెలియంది కాదు. బస్సులోనే కాన్పైన తల్లులు, పుట్టిన పిల్లలు మీలో ఎంత మందున్నరో మీకు తెల్సు. అందుకనే ఆ ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకొని, మరెన్నో మహాకార్యాలు నెర్పడానికి ప్రభుత్వం వారు ఒక మహారోడ్డుని వేయడానికి పూనుకున్నారు. అందుకు మీ సహకారం కావాలని చెప్పడానికే ఇక్కడికి వచ్చిన" అని ఆగిండు.

"ఇది మామూలు రోడ్డుకాదు, అంతర్జాతీయ రహదారి. ఆసియా ఖండం మొత్తం చుట్టొచ్చేదారి, ఎనిమిదిలైన్ల వెడల్పుగల మహా... ...శర్ణసేనలు కవాతు చేసి ఆసియా ఖండాన్ని చుట్టొచ్చే... ...తంలోని ఉగ్రవాదాన్ని తుది ముట్టించడానికి ప్రపంచ ... చేసే యజ్ఞంలో భాగమే ఈ దారి. ఈ రోడ్డుతో మనకెన్నో వుపయోగాలున్నాయి, మనం రహస్యంగ కొనుక్కునే విదేశీ సరుకులన్నీ మన బడ్డీకొట్లల్లో పెట్టి అమ్ముకోవచ్చు. అమెరికా, చైనా, జపాన్, ఆస్ట్రేలియా ఒక్కటేంటి ప్రపంచం నలు మూలల నుంచి వచ్చే సరుకులన్నీ మన రోడ్డుమీదనే కొనుక్కోవచ్చు. మనం పండించే పంటల్ని ఏ దేశంలోనైనా అమ్ముకోవచ్చు" అని జరంత సేపు మొసతీస్కోవడానికి ఆగిండు.

గుక్కెడు మంచినీళ్ళు నోట్లోపోస్కొని "చాలా ఊర్లు ఎంతో కొంత రోడ్డు కింద పోతున్నాయ్. మీ ఊరొక్కటే రోడ్డుకు సెంటర్లోవుంది, కాబట్టి మీ ఊరు మొత్తం రోడ్డు కింద పోతుంది. అందుకే ముందుగాల మీకు చెప్పడానికి వచ్చిన. బలవంతంగ ఖాళీ చేయించే కాడికి తెచ్చుకోకండి, మీ ఇష్టమొచ్చిన ఊర్లో మీ ఇండ్లు కట్టుకోండి. అందరికి ఒక్కచోటే కావాలంటే దొరకది భూమి. రోడ్డు కిందపోయిన జాగలకు ప్రభుత్వం తులమో, ఫలమో వెల కట్టి నష్టపరిహారం ఇస్తది" అని ముగించి సర్రున బైలెల్లిండు ఆర్.డి.ఓ. తోడుగా వచ్చినా చిన్నా, చితుక ఉద్యోగులు నిమిషంలో తుర్రుమన్నరు. ఊరు క్షణం పాటు మూగదైపోయింది.

జనం ఎర్రి మొఖాలేసుకొని ఒకళ్లనొకళ్ళు చూసుకుంటున్నరు. ఏమీ అర్థం గాని అయోమయంలో పడ్డరు. బడికొట్టం అరుగుమీద మున్సబు తల కాళ్ళ సందుల ఇరికించుకొని కూర్చున్నడు. తలో దిక్కు ఆలోచిస్తున్నరు. మున్సబు ఏం మాట్లాడతలేడు. జనంలోంచి ఎవరో వుండి గట్టిగ అర్సిండు. "రోడ్డుని ఊరు పక్కనుంచి మల్లియాలి" అని

"చేన్లు పోతయిగదా, తర్వాత ఏం చేసి బతుకుతవు?" అన్నడు మరొకడు.

"నిజమే, అయితే గెట్లామరి" అని నోరు తెర్సిండొకడు.

"మున్సబో మాట్లాడవు మరి" అన్నడు నాయుడు.

"ఎవరేమన్నా అందరం ఒక్కమాట మీదుండాలె" అన్నడు మున్సబు.


ఏమి చెయ్యడానికైనా గ్రామప్రజలందరి తోటి ఒక కమిటీ ఏయాలన్నడు. కులానికి ఒక్కడు చొప్పున కమిటీలో ఉండాలని తీర్మానించుకున్నరు. 'రోడ్డు నిర్వాసితుల పోరాట కమిటీ'అని పేరు పెట్టుకున్నరు. కమిటీకి కన్వీనర్‌గా మున్సబుని పెట్టిన్రు. కులానికి ఒక్కడు చొప్పున ఎన్నుకున్నరు. మాదిగోల్ల తరుపున లచ్చిగాడ్ని కమిటీ సభ్యునిగా పెట్టిన్రు. ముందుగాల మండల ఆఫీసు ముందు ధర్నా చేయాలని తీర్మానించుకున్నరు. ధర్నాకోసమని లచ్చిగాడు ప్లేకార్డులు రాస్తుండు.

"ఊర్ని కాపాడాలి" టక్కున ఆగిపోయిండు,

"ఊర్ని ఎవర్నించి కాపాడాలి? సంకీర్ణ సైన్యాలనుంచా? గ్రామ పెత్తందార్ల నుంచా?" చాలా సేపు ఆలోచిస్తూ వుండిపోయిండు.

"నన్ను ఊర్లోకి రానీయని ఊర్ని నేనెందుకు కాపాడాలి" ఆవేశం కట్టలు తెగింది. ప్లేకార్డుపై ఖాండ్రించి వుమ్మిండు. వుమ్ము తడికి ప్లేకార్డుపై అక్షరాలు కారిపోతున్నాయి. అచ్చరాలు మాసిపోతున్నట్టు, ఊరు మాయమైపోతుంది కండ్ల ముంగట.

●




## రైతులకు వ్యవసాయ సలహాలు


బుగ్గారెడ్డి

నాకిప్పుడు 75 సంవత్సరాలు. నాకు అయిదుగురు కుమారులు, ఒక కూతురు. వారందరూ ఉన్నంతలో వారి వారి రంగాలలో బాగానే స్థిరపడ్డారు. ఇప్పుడు నాకు ఎలాంటి బాదర బందీలు లేవు. సమస్యలూ లేవు. నిత్యం దేవాలయానికి వెళుతూ, ఆధ్యాత్మిక భావనతో చాలా ప్రశాంతంగా గడుపుతున్నాను. నేను సంప్రదాయ వ్యవసాయదారుల కుటుంబం నుంచి వచ్చిన వాణ్ని. కాబట్టి, నా అనుభవం మేరకు కోరి వచ్చిన రైతులకు ఆయా పంటల వివరాలను చెబుతున్నాను. వాటి సాగు విధానాలు, ఎరువులు వంటి వాటి గురించిన సందేహాలు తీరుస్తూ తగిన సలహాలు ఇస్తున్నాను. కని, పెంచి, విద్యాబుద్ధులు చెప్పిన వారి తల్లిదండ్రులను ఈ తరం వారు నిర్లక్ష్యం చేయకూడదని నా సలహా. వారి అంతిమ జీవితాన్ని ఆనందకరం చేసుకోవడానికి సహకరించవలసిందిగా కోరుతున్నాను.

*- బి.ఎన్.బుగ్గారెడ్డి, బేతంచర్ల, కర్నూలు జిల్లా*

## ఆధ్యాత్మిక విలువలకు ప్రచారం


పాండురంగారావు

హిందీ పండితునిగా రిటైర్ అయిన నా వయసు ఇప్పుడు 70 ఏళ్ళు.పలు ఆధ్యాత్మిక, ధార్మిక పుస్తకాలను రాశాను. మన భారతీయ ధర్మ సంస్కృతుల వారసత్వాన్ని సమగ్రంగా తెలుసుకుంటూనే, ఆ విజ్ఞానాన్ని పదిమందికీ పంచిపెట్టే ప్రయత్నం చేస్తున్నాను. మన ఆచారాలు, సాంప్రదాయాలలోని ఆధ్యాత్మిక, వైజ్ఞానిక విలువలను ప్రచారం చేస్తూ, భారతీయ గౌరవ ప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేయాలన్నదే నా జీవితాశయంగా భావిస్తున్నాను. ఒక గురుపీఠంలో ఆస్థాన పండితునిగా వ్యవహరిస్తూనే పలు విద్య, ధార్మిక, సామాజిక సేవా సంస్థలకు నాకు చేతనైనంతలో సేవలు అందిస్తున్నాను. కవిగా, రచయితగా, గాయకునిగా, నటునిగా, దర్శకునిగా, చిత్రకారునిగా, హరికథావధాన ప్రయోక్తగా ఇలా పలు రంగాలలో నాదైన కృషిని కొనసాగిస్తున్నాను. మహోన్నతమైన జ్ఞాననిధి అయిన భగవద్గీతపై అనేక పట్టణాలలో ఉపన్యాసాలు ఇస్తున్నాను. ఈరకంగా ఎంతో కొంత సామాజిక శ్రేయస్సుకు పాటుపడుతున్నాను.

*- కొల్లిపర పాండురంగారావు, స్వర్ణరోడ్, చీరాల*

---

**మీరూ ఆదర్శవంతులైన వృద్ధులా!**

మీదైన బాటలో సమాజ శ్రేయస్సుకు పాటుపడుతున్నారా? ఇంకెందుకు ఆలస్యం? వెంటనే మీ వివరాలు, ఫొటో పంపండి. ఇక్కడే వాటిని ప్రచురిస్తాం. మా చిరునామా:

**జీవన సంధ్య**, ఎడిటర్, 'ఆదివారం వార్త', వార్త దిన పత్రిక, లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-80